# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 03 సెప్టెంబరు, 2024 | పేజీలు :6


## కలెక్టర్ సార్.. జర మా బాధలు పట్టించుకోండ్రి...

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వాల్గొండ లోని గోదావరి నది ఉదృతిని పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలెక్టర్ సారు జర మా బాధ ను పట్టించుకోండ్రి అంటూ ఓ మహిళా ప్రాధేయపడిన తీరు అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. సోమవారం ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి దిగువకు వదులు తుండడంతో నదిని పరిశీలించేందుకు వచ్చి తిరిగివెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మి అనే మహిళ పూరి గుడిసెల్లో బతుకుతున్న మాకు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని, మా సమస్యలు చూద్దువు ఒక్కసారి రా సారు అంటూ ఒక్కసారిగా కలెక్టర్‌కు దగ్గరకు వచ్చి ప్రాధేయపడడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. జిల్లా అధికార యంత్రాంగం మళ్లీ చూద్దాం అంటూ అక్కడి నుండి వెళ్లగానే పూరి గుడిసెల నీడలో పిల్లలతో బతుకుతున్నామని మమల్ని ఆదుకునే వారే కరువయ్యారని, మా బాధలు లీడర్లకు అవసరం లేదు. ఇంత పెద్ద మనుషులు కనీసం మీకైనా పట్టవా అంటూ ఏడుస్తూ బాధపడడం అక్కడే ఉన్న స్థానికులు నచ్చజెప్పగా, ఈ గంగలో కలిసినప్పుడే మా బాధలు తీరుతాయంటూ ఆవేదనతో వెళ్లిపోయింది.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం
## కరీంనగర్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వల్ల గానీ మరేవిధమైన వేదింపులతో ఇబ్బందులు ఎదర్కొంటున్నట్లయితే నిర్భయంగా షీ టీం లేదా ఉమెన్ పోలీస్ స్టేషన్ పోలీసులను సంప్రదించవచ్చని కరీంనగర్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని బిసి వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో సోమవారం షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఉమెన్ పోలీస్ స్టేషన్, షీటీమ్స్ ఇంచార్జి ఇన్స్‌పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ కమిషనరేట్ వ్యాప్తంగా మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విధ్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విధ్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు గురైనా, మహిళలు, బాలికలపై ఎవరైనా లైంగిక వేదింపులకు గురైనా వెంటనే నిర్భయంగా షీటీం పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని తెలిపారు. షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మహిళలు సామాజిక మాద్యమాల వినియోగంలో జాగ్రత్తలు వహించాలన్నారు. వాటిలో ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670759 ఫోన్‌కు గానీ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో 6 క్రిమినల్ కేసులు నమోదు చేశామని, 21 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ చేశామని తెలిపారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు తెలంగాణ రాష్ట్ర పోలీసు వారు ప్రవేశపెట్టి T.SAFE AAP ని వినియోగించుకోవాలని , మీ ప్రయాణంలో భరోసానిస్తుందని తెలిపారు.

# మొబైల్ రీడింగ్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి
## ... జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** సమాజానికి విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు అవసరమైన మెటిరియన్‌ను అందుబాటులో ఉంచేందుకు మొబైల్ రీడింగ్ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణంలో రీడింగ్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా మొబైల్ రీడింగ్ లైబ్రరీ వాహనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 15 మండలాలలో ఈ మొబైల్ రీడింగ్ లైబ్రరీ ద్వారా సమాజానికి, పిల్లలకు చదవడ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం, 3 నుండి 8 సంవత్సరాల పిల్లలకు ప్రారంభ దశలో పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈ వాహనము జిల్లాలో 7 రోజుల పాటు గ్రామ గ్రామాల తిరుగుతుందని, వందలాది పుస్తకాలు ఈ వాహనంలో అందుబాటులో ఉంటాయని, అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అదికారి పార్శి అశోక్, క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, రూమ టు రీడ్ ఇండియా జిల్లా లీడ్ జెన్నిఫర్, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు కలెక్టర్ అభినందన



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి ;**మన జిల్లాలో ఉన్న గర్భిణీ మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధికంగా సురక్షిత ప్రసవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గర్భిణీ స్త్రీల అందించే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అద్భుతంగా సేవలందించిన వైద్యులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఏం.ఎన్.ఏం , ఆశా కార్యకర్తలను వినియోగించుకుని గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ 100% పూర్తి చేయాలని, జిల్లా కేంద్రం లోని పెద్దపల్లి మాత శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం, మంథని లోని ఎంసిహెచ్, గోదావరిఖని లోని జనరల్ ఆసుపత్రి , సుల్తానాబాద్ ఆసుపత్రి లలో అత్యధిక ప్రసవాలు సురక్షితంగా జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.. ఆస్పత్రులలో టిఫా స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన గర్భిణీ మహిళలు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. .ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ , జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# వరద నీటితో ఆలీ సాగర్ రిజర్వాయర్ గేట్ ఎత్తివేత



**ప్రజాపక్షం/ఎడపల్లి:**గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల లోనిచెరువులు,కుంటలు,వాగులుపొంగిపోర్లుతున్నాయి. ఆలీసాగర్ రిజర్వాయర్‌లోకి 1400క్యూసెక్కుల భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అలీసాగర్ జలాశయం నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో జలాశయం లోకి నీటి ఇన్ ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమై అలీ సాగర్ జలాశయం ఒక గేటుకు సోమవారం ఎత్తివేసి 600క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు బ్రహ్మణపల్లి చెరువులోకి చేరి అటు నుంచి రెంజల్ మండలంలోని మొండి వాగు ద్వారా గోదావరి నదిలోకి వెళ్తుందని ఇరిగేషన్ డీఈ లోక్య నాయక్ తెలిపారు. వరద నీటి ఇన్ ఫ్లో ఉన్నంత వరకు గేట్లను ఎత్తివేసి ఉంటాయని ఇన్ ఫ్లోతగ్గినతరువాతగేట్లనుమూసివేస్తామన్నారు..డీఈతో పాటుబోధన్ఏసీపీశ్రీనివాస్‌రూరల్‌సీఐ, రైతులుఉన్నారు.

# ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ ;**అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామంఆల్లో ఘనంగా జరుపుకున్నారు. పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో ముస్తాబు చేసిన బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను మసర్పించారు. ఆయా దేవాలయాల్లో ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్లను ఇంటి వద్దకు తీసుకువచ్చి వాటి మూతి, కొమ్ములను కడిగి ఇంట్లో చేసిన పిండి వంటకాలు నైవేద్యాలు ఎడ్లకు తినిపించారు. అన్నదాతలకు ఏడాది పొడవుగా తమకు చేదోడు వాదోడుగా నిలిచే బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన చౌక్ లలో ఈ ర్యాలీ నిర్వహించారు.

### నేడు బడుగ పండుగ...

పొలాల అమావాస్య మరుసటిరోజు బడుగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. శ్రావణమాసంలో నెల రోజుల పాటు మాంసాన్ని భుజించకుండా నియమనిష్టలు పాటించిన వారు మంగళవారం బడుగా పండుగ జరుపుకుంటారు. అనంతరం మాంసాహారం స్వీకరిస్తారు. ఈగలు, దోమలు రోగాలు తీసుకుపోరా బడుగా అంటూ ఇంట్లో నుంచి కేకలు వేస్తారు. ఈ రోజు నుండి ఈగలు, దోమలు, వ్యాధుల పారిపోతాయని వారి నమ్మకం.

## బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి ప్రధాత



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి ;** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కై కృషి చేసిన మహోన్నత వ్యక్తి వైఎస్ఆర్ అని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ భవన్‌లో వైఎస్ఆర్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో చందానాయక్, వేణురాజ్, విపుల్ గౌడ్,సంతోష్,రామకృష్ణ,ప్రీతంపాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎండ్‌హెచ్ఒ



**ప్రజాపక్షం/కాసిపేట ;** కాసిపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం బెల్లంపల్లి డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ సుధాకర్ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు మంచి వైద్యం అందించడానికి విధుల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాలలు, అన్ని గ్రామాలలో ఫీవర్ సర్వే చేయడానికి పిహెచ్‌సి సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ రవి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాళ్లను తొలగించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి;**ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూరిబా గాంధీ పాఠశాలలో కుల వ్యవస్థను మార్చే ఉపాధ్యాయులే విధ్యార్థులను కులం పేరుతో దూషిస్తూ ఇబ్బందులకు గురిచేయడం చాలా దారుణమని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇలాంటి అవమానసీయ మాటలకు పాల్పడ్డ ఉపాధ్యాయురాళ్లను సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమాజం సిగ్గుపడేలా చాలా మంది ఉద్యోగ ఉపాధ్యాయులు వారు పనిచేస్తున్న కార్యాలయం, పాఠశాలలో తోటి ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులపై వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. అధికారులైతే ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల వివక్ష కనపరుస్తూ మెమోలు సస్పెన్షన్లకు గురిచేస్తూ ఆటవిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. ఇంకా కుల వివక్ష ఉండడం సిగ్గుచేటన్నారు. విద్యావంతులు, ఉద్యోగాలు చేస్తూ సమాజాన్ని మార్చాలని, కులాన్ని నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజన్న సురేష్, ఐలన్న, రవీందర్, శివకుమార్, రంగన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఎడపల్లి;**శ్రావణమాసం చివరి సోమవారం కావడం, అమావాస్యను పురస్కరించుకొని ఎడపల్లి మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామ శివారులో గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద గల అష్టముఖి కొనేరులో స్నానాలు ఆచరించి లక్ష్మీ సమేత నరసింహ స్వామిని,శివాలయంలోలింగేశ్వరుణ్ణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రోజు వచ్చే అమావాస్యను సోమతి అమావాస్య లేదా మౌని అమావాస్య లేదా శని అమావాస్య అని అంటారని, ఈ రోజు రావిచెట్టును పూజించడం ద్వారా రాబిచెట్టులో ఎల్లప్పుడూ కొలువు దీరి ఉండే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పూజించినట్లు అవుతుందని, అలాగే రావి చెట్టుకు 108సార్లు ప్రదక్షిణలు చేసి పేద వారికి లేదా పశుపక్షాదులు సంతృప్తి చెందేందుకు తినడానికి అందించిన వారికి గ్రహ బాధలు నివారించబడి వారు కోరిన కోరికలు తీరుతాయని పురోహితులు తెలిపారు.

## ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా పోగుల



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి ;** పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా పోగుల విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక నందన గార్డెన్లో జరిగిన పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలలో రెడ్డి భాస్కర్ ప్యానల్ పై పోగుల విజయ్ కుమార్ ప్యానల్ 42 ఓట్లతో తేడాతో విజయం సాధించారు. జిల్లా అధ్యక్షులుగా పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండి ఇర్ఫాన్, జిల్లా కోశాధికారిగా అల్లం సతీష్ లు ఎన్నికైనట్లు ఎన్నిక అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా తమ ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు,తెలంగాణ రాష్ట్ర ఫోటో,వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు మహిమల కేదార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అప్పాసు రాము, లగిశెట్టి చంద్రమౌళి, పల్లెర్ల ఉదయ్,కుర్మ రమేష్ బాబు, తాతరాజు, శ్రీనివాస్ ,రెడ్డి భాస్కర్,వనపర్తి శ్రీనివాస్ లతో పాటు పెద్ద సంఖ్యలో జిల్లాలో ఫోటో వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## పొలాల అమావాస్య...

**ప్రజాపక్షం/కుంటాల;**మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో సోమవారం పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు.అంతేగాకుండ,ఎడ్ల కొమ్ములకు రంగులు దిద్ది,కాళ్లకు గజ్జెలు,మెడలో గంటలు,కొత్త కన్నాలుతో ఒంటి పై జీనుగులువేసి అందంగా ముస్తాబు చేసిన బసవన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సాయంత్రం వేళలో ఊరంతా ఒకచోట చేరి డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపూగా వెళ్ళి గ్రామంలోని హనుమాన్ ఆలయం చుట్టు ఎద్దులతో కలిసి రైతులు ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు.వ్యవసాయేత ర కుటుంబాల వారు మట్టితో చేసిన ప్రతిమలను ఇండ్లలో ప్రతిష్టించి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను సమర్పించారు.పలు గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

## చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



**ప్రజాపక్షం/జన్నారం ;**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చిరు వ్యాపారులకు సోమవారం రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ సోమవారం రోజున గొడుగులను పంపిణి చేశారు. రోడ్ల పక్కన కూర్చుని తోటల్లో పెంచిన కూరగాయలను అమ్ముకొని జీవనం సాగిస్తున్న కొందరు చిరు వ్యాపారులందరికి గొడుగులను పంపిణి చేయడం జరిగిందని ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేయడం తన ధర్మం అని రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ తాజా మాజీ జడ్‌పిటిసి ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి, సదాశివ, రాహుల్, పాల్గొన్నారు

## పెన్‌గంగా ఉగ్రరూపంతో రాకపోకలు బంద్



**ప్రజాపక్షం/సిర్పూర్(టి);** సిర్పూర్ (టి) మండలంలో పెన్‌గంగా నిది ఉధృతి పెరుగుతుండటంతో సరిహద్దు గ్రామాలైన హుడికిలి, వెంకట్రావ్‌పేట్ రాకపోకలు నిలిపివేశారు. స్థానిక తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఎంపిడిఒ సత్యనారాయణ, ఎస్ఐ కమలాకర్‌లు మాట్లాడుతూ పెన్‌గంగా ఉగ్రరూపంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, హుడికిలి వద్ద రోడ్డు పైకి బ్యాక్ వాటర్ రావడంతో దారి మూసివేయడం జరిగిందని అన్నారు. మహారాష్ట్ర వైపు రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. తహసీల్దార్ సిబ్బంది, పోలీసు సిబ్బంది బందోబస్తు ఉన్నట్లు తెలిపారు. వెంకట్రావ్‌పేట్ సమీపంలోని అంతరాష్ట్ర బ్రిడ్జి వద్ద క్రమంగా వరద నీరు పెరుగుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు వాహనదారులుఅప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## చిన్నారులను అక్కున చేర్చుకున్న బాలల పరిరక్షణ సిబ్బంది



**ప్రజాపక్షం/సారంగాపూర్ ;**మండలంలోని వంజర్ గ్రామానికి వచ్చి మతిస్థిమితం కోల్పోయిన సునీత అనే మహిళ ఇద్దరు పిల్లలను సోమవారంబాల రక్షణ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు.జిల్లా పాలనాధికారిఆదేశానుసారంవారికిరక్షణకల్పించినట్లుసిబ్బందిపేర్కొన్నారు.ఇందులోమాజీసర్పంచ్,ఉపసర్పంచ్‌లక్ష్మయ్య,హరీష్,మహేష్ యాదవ్,గంగాధర్,జిల్లాబాలలపరిరక్షణసిబ్బంది ఉన్నారు.

# మహిళా గ్రూపుల ఆర్‌పిలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కరీంనగర్;**మహిళా సంఘాల గ్రూపుల డబ్బులను వాడుకున్న ఆర్‌పిలపై చర్యలు తీసుకుని బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆద్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ మహిళా గ్రూపులకు తెలియకుండా, దొంగతనంగా సంతకాలు పెట్టించుకుని గ్రూపులకు చెందాల్సిన డబ్బులను వాడుకున్న ఆర్‌పి శాఖపరమైన చర్యలు తీసుకుని, ఆర్‌పి వాడుకున్న డబ్బులు రూ.12.50 లక్షల రూపాయలు రికవరీ చేయాలన్నారు. 20 గ్రూపులకు సంబంధించిన డబ్బులు గ్రూపు సభ్యులకు తెలియకుండా గ్రూపు ఖాతాలో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకోవడం సరికాదన్నారు. 11వ డివిజన్‌కు సంబంధించిన గణేష్




సమైక్య ఆద్వర్యంలో దాదాపు 20 గ్రూపులున్నాయని, ఈ సమైక్యకు గాదం అరుణ ఆర్‌పిగా ఉన్నారని తెలిపారు. బ్యాంకులో డబ్బులు వేస్తున్నామని చెప్పి రూ.12 లక్షల 50 వేలు వాడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. డబ్బులు వెంటనే రికవరీ చేయాలని, సొంతంగా వాడుకున్నందుకు ఆర్‌పిపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత మహిళలకు న్యాయం చేయాలన్నారు. కమిషనర్, అధికారులు, మెప్మా అధికారులు స్పందించి మహిళా సంఘాల గ్రూపులలో అవినీతి అక్రమాలు లేకుండా చూడాలన్నారు. ఐద్వా ఆద్వర్యంలో జరుగుతున్న ధర్నా వద్దకు అడిషినల్ కమిషనర్ సువార్త, మెప్మా పిఆర్‌పి అనితలు వచ్చి సమస్య పరిష్కారం చేస్తామని , ఆర్‌పిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంత ధర్నా విరమించారు. సమస్యను పరిష్కారం చేయడంతో పాటు గ్రూపులోని మహిళలకు రావాల్సిన డబ్బులను రికవరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు పి.దేవేంద్ర, సమైక్య అధ్యక్షులు కుంటా సుప్రజ, సమైక్య కార్యదర్శి చంద్రకళ, పూనా నవ్య, కోశాధికారి తాడెం శ్రీలత, వంగల జ్యోతితో పాటు మహిళా సమైక్య గ్రూపుల సభ్యులు పాల్గొని ఆందోళన చేశారు.

# తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గంగాధర;**గంగాధర మండలం మధురానగర్ ఎస్సీ కాలనీలో నల్లాల బావిలో వరద నీరు కలవడంతో త్రాగునీరు కాస్త మురుగు నీరుగా మారి కలుషితమవడంతో కాలనీ వాసులు త్రాగు నీటికి ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో ఉన్న బోరు బావికి మోటార్ వైర్, స్టార్టర్ అందజేసి త్రాగునీటి సమస్యను తీర్చారని కాలనీ వాసులు తెలిపారు. ఈ సంధర్భంగా ఎస్సీ కాలనీ ప్రజలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధురానగర్ గ్రామ సెక్రటరీ రాధా సులోచన, చొప్పదండి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఒడ్నాల యజ్ఞేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గంగాధర సుదర్శన్ తదితరులున్నారు.

# చెక్కును అందజేసిన మండల అధ్యక్షుడు



**ప్రజాపక్షం/బాన్సువాడ;** బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన ఆదిత్యకు ముఖ్యమంత్రి సహాయనిది కింద మంజూరైన 36వేల చెక్కును సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ స్థానిక నాయకులతో కలిసి లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు బోయిని శంకర్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతురం కాశిరాం, సొసైటీ డైరెక్టర్ రాములు లక్ష్మి నారాయణ, సాయిలు, నబీ, లక్ష్మ ణ్, పాయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# సహకార ఎన్నికలు ఏకకాలంలో జరిపించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి;**ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో జరిపించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కడారి అయిలన్న డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ కురుమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిలుగా హాజరై వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకందారులకు ఎన్సీడీపి, నాబార్డు ద్వారా 75 శాతం సబ్సిడీతో అర్హులైన గొర్రెల కాపరులకు పది లక్షల వరకు లోన్ ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు పిడుగు పడి, పాముకాటుకు చనిపోయిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గొర్రెలకు ఇన్సూరెన్స్, కాపరులకు ఫారెస్టు అధికారుల వేదింపులను అరికట్టాలని, అడవిలో గొర్రెలు మేపుకొనుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందవేణి ప్రసాద్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జంగం కొమురన్న, జిల్లా కార్యదర్శి చిగుర్ల కొమురయ్య, కురుమ టౌన్ ప్రెసిడెంట్ గూడెం శ్రీనివాస్ , రాజుయాదవ్, దాడి రాజబాబు, గంగం లింగయ్య, రాధారపు కుమార్, మహేందర్ తదితరులున్నారు.



# ఎస్సీ, ఎస్టీ కోర్టు పిపిగా ఆరెల్లి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి;**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది ఆరెల్లి రాములును ఇంచార్జిగా తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా రెండవ అదనపు కోర్టులో ఆరెల్లి రాములు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు స్పెషల్ ఎస్సీ ఎస్టీ కోర్టుకు ఇంచార్జిగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు ఈ నియామకం కొనసాగుతుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. వీరి నియామకం పట్ల కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి రాజ్ కుమార్, బేతి మహేందర్ రెడ్డి, శ్రీరాములు,రాజిరెడ్డి, గడ్డం లక్ష్మ ణ్, ఎస్.జనార్ధన్ గౌడ్, కొత్త ప్రకాష్, కటకం శ్రావణ్ కుమార్, తుమికి పవన్ కుమార్, జి.శ్రీనివాస్ గౌడ్, డి వి రమణ పలువురు అభినందనలు తెలిపారు.



# ఘనంగా ఎడ్ల పొలాల పండుగ

**ప్రజాపక్షం/ఎడపల్లి;**ఎడపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలలో సోమవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బసవన్నలకు అందంగా అలంకరించి ర్యాలీగా వచ్చి గ్రామాల్లో గల హనుమాన్ ఆలయం చుట్టు రైతులు ఎడ్లను ప్రదక్షిణలు చేయించి, నైవేద్యాలు , పిండి వంటలు వాటికి తినపించారు. ఏడాది పొడవునా తమకు సేవలందించి చేదోడువాదోడుగా ఉండే ఎద్దులను వ్యవసాయ కుటుంబాల వారు సాక్షాత్తు నంది స్వరూపులుగా భావిస్తారు. శ్రావణ మాసం వచ్చే చివరి అమావాస్య రోజున ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు తినిపించడం ఆనవాయితీ. ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి పోచమ్మ, హనుమాన్ ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేసి పిండి వంటలు తినిపించారు. ఊరూరా ఎడ్ల పొలాల సందడి నెలకొంది. గ్రామాల్లో యాంత్రీకరణలో భాగంగా ఎడ్ల వినియోగం తగ్గిపోవడంతో ఉరేగింపులో వాటి కొరత స్పష్టంగా కనబడింది. అయితే సోమవారం కొన్ని గ్రామాల్లో ఎడ్ల పొలాల అమావాస్య నిర్వహించగా మరి కొన్ని గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్నారు.



# పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

**ప్రజాపక్షం/ధర్మపురి;**రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థినికి బంగారు పతకం లభించినట్లు మగ్గిడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, పిడి రాజేందర్‌లు తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని దొంతాపూర్,మగ్గిడి మోడల్ స్కూల్‌లో ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న భూక్య శ్రావణి శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ బెంచె ప్రెస్ చాంపియన్స్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి పాల్గొని 47 కిలోల మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా శ్రావణికి బంగారు పతకంతో పాటు రాష్ట్ర స్ట్రాంగ్ ఉమెన్ అవార్డును గెలుచుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, పీడిలు విద్యార్థినిని అభినందించారు.




# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/బోధన్;**గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఏసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు. బోధన్ మండలం హంగర్గ గ్రామంను సోమవారం ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాలలో ఉంటున్న కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట బోధన్ రూరల్ సిఐ నరేష్, తహసీల్దార్ విఠల్, ఎస్సై మచ్చేందర్ తదితరులు ఉన్నారు.

# వర్షాభావ పరిస్థితులను పరిశీలించిన పోచారం

**ప్రజాపక్షం/బాన్సువాడ;**బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాలనీలో పర్యటించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా సంగమేశ్వర్ కాలనీలోని కాలువ పరిస్తితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, ఉదయ్, నర్సుగౌండ, కౌన్సిలర్లు లింగమేశ్వర్, వెంకటేశ్, కిరణ్, హకీమ్ పాల్గొన్నారు.



# మునిగిన ఉమామహేశ్వర ఆలయం

**ప్రజాపక్షం/నందిపేట్ ;**నందిపేట మండలంలోని ఉమ్మెడ గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున ఉన్న ఉమామహేశ్వర ఆలయం వర్షాల ఉధృతికి నీట మునిగింది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే ఈ ఆలయం మునిగిపోతుంది.ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మునిగిపోతున్న ఈ ఆలయం మళ్ళీ శివరాత్రి ఉత్సవాలకు బయట పడుతుంది. ఉమ్మెడ గ్రామాభివృద్ధి కమిటి ముందుకు వచ్చి బురదమయం అయిన ఆలయాన్ని శుభ్రం చేసి శివరాత్రి ఉత్సవాలకు రంగులు వేసి స్దిదం చేస్తారు. తమ మొక్కులు తీర్చుకోవడానికి మహారాష్ట్ర, ఇతర జిల్లాల నుంచి వస్తుంటారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలి



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ ;**గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల ప్రజలతోపాటు, మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని సుల్తానాబాద్ ఎస్సై శ్రవణ్ కుమార్ సూచించారు. సోమవారం సుల్తానాబాద్ మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలతో పాటు కందనూరిపల్లి, మియాపూర్, కొదురుపాక, తదితర గ్రామాలను సందర్శించి గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. శిథిల వ్యవస్థలో ఉన్న గృహాలను గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో నివసించాలని సూచించారు. వాగులు చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరు చాపల వేటకు వెళ్లకూడదని మత్స్యకారులను హెచ్చరించారు. అవసరం ఉంటే తప్ప ఎవరు ఇంట్లో నుంచి బయటికి రావద్దని సూచించారు. ఏదైనా ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపడినచో వాటి వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు పాటించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. గండిపడి చెరువులను కుంటలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో100కు, మెడికల్ ఎమర్జెన్సీలో 108 కు సమాచారం అందించాలనిసూచించారు. పొంగే నాళాల వద్దకు వెళ్లకూడదని ఏదైనా గ్రామంలో పొంగేనాలను గుర్తిస్తే వెంటనే సమాచారం అందిస్తే ఎలాంటి ప్రమాదం జరగకుండా బారికెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రతి గ్రామంలో ఏదైనా ముఖ్యమైన సమాచారం ఉంటే వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని గ్రామ ప్రజలకు ఎస్సై శ్రావణ్ కుమార్ సూచించారు.

## బసవన్నలకు మండల వ్యాప్తంగా ప్రత్యేక పూజలు..



**ప్రజాపక్షం/లోకేశ్వరం ;**మండల వ్యాప్తంగా పొలాల అమావాస్య పండుగ సందర్భంగా ఆయా గ్రామాలలోని శివాలయాలలో ఆంజనేయ స్వామి ఆలయంలో బసవన్నలకు ప్రత్యేకండా అలంకరించి వ్యవసాయ పనుల్లో అండగాఉండే బసవన్నకు పూజలు నిర్వహించి అనంతరం స్త్రీలు సౌభాగ్యం సంతానం పిల్లల యోగక్షేమాల కోసం పూజలు నిర్వహించి పాడిపంటలు బాగా పండాలని ఆ భగవంతుని వేడుకున్నారు.

## వైద్యశాలకు వైద్యుడిని నియమించండి.!




**ప్రజాపక్షం/ముత్తారం :**ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో గల ప్రభుత్వ హూమియో వైద్యశాలకు గత మూడు మాసాలుగా వైద్యులు లేక అనారోగ్యాల బారిన పడిన ప్రజలుఇబ్బందులు పడుతున్నారని బిజెపి మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య అన్నారు. ఖాళీగా ఉన్న దవాఖానాకు వచ్చి రోగులు డాక్టర్ లేకపోవడంతో తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికైనా రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హోమియో వైద్యశాలకు వైద్యుడిని నియమించాలని కలెక్టర్ ని ఆయన కోరారు.

## నూతన కార్యనిర్వాహక కమిటీ



**ప్రజ పక్షం/రామగిరి ;** సింగరేణి సంస్థ రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల వర్క్ పీపుల్ స్పోర్ట్స్ & గేమ్స్ అసోసియేషన్ 202425 సంవత్సరానికి సంబంధించి వివిధ క్రీడా పోటీలు నిర్వహించడానికి నూతన కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేసినట్లు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ నిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్వోటుజియం జి.రఘుపతి, చీఫ్ కోఆర్డినేటర్ గా పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శిగా వి.సునీల్ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా పర్సా శ్రీనివాస్, కోఆర్డినేటర్ గా కె.వి.నరసింహారెడ్డి కొనసాగనున్నారు.అదేవిధం క్రీడలకు కెప్టెన్ల నియామకంలో భాగంగా జనరల్ కెప్టెన్ గా కె.ఎల్.ఎన్.వి.ప్రసాద్, ఫుట్ బాల్ కెప్టెన్ గా గడ్డం రమేష్, హాకీ కెప్టెన్ గా బి. సదానందం, అగ్గి నాగరాజు, వాలీబాల్ కెప్టెన్ గా ఎన్.వి.రాజు, కబడ్డీ కెప్టెన్ గా జె.అంజయ్య, బాస్కెట్ బాల్ కెప్టెన్ గా ఎం.రాజేందర్, బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్ గా ఏ.లక్ష్మయ్య, క్రికెట్ కెప్టెన్ గా వి.సంపత్ కుమార్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్ కెప్టెన్ గా ఎం.డి.హాఫీజుద్దీన్, లాంగ్ టెన్నిస్ కెప్టెన్ గా వి.సిహెచ్. రెడ్డి, టెన్నిస్ కెప్టెన్ గా ఏ.శివప్రతాప్, క్యారమ్స్ కెప్టెన్ గా డి.శ్రీనివాస్, చెస్ కెప్టెన్ గా బి.శంకర్, స్విమ్మింగ్ కెప్టెన్ గా బి.రాయమల్లు, కల్చరల్ ఈవెంట్స్ కెప్టెన్ గా కె.రాధాకృష్ణ, షటిల్ బ్యాడ్మింటన్ కెప్టెన్ గా వీరేందర్, మహిళల క్రీడా విభాగం ప్రతినిధిగా బి.మమత ను నియమించినట్లు వారు తెలిపారు.

## పొలాల అమావాస్య పండగ



**ప్రజాపక్షం/బైంసా ;**బైంసా పట్టణంలో పొలాల అమావాస్య పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ పండుగ సందర్భంగా రైతులు తమ పంట పొలాంలకు తోడు ఉండే బసవన్నలకు ప్రత్యేకంగా అలంకరించారు.ఆలయాల చూట్టూ ప్రదక్ష ణలు చేసి,ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన తోరణాల వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్ తోపాటు పట్టణ ఆయా గల్లి వాసులు,సర్పంచ్,ఉప సర్పంచులు,ప్రముఖులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు తప్పని తిప్పలు



**ప్రజా పక్షం /వేములవాడ :**ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం పరిసర ప్రాంతాలైన టీటీడీ ధర్మశాల, నందీశ్వర కాంప్లెక్స్, లక్ష్మీ గణపతి కాంప్లెక్స్, శివపురం, శంకరపురంలాంటి యాత్రికుల వసతి గదులతో పాటు భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో దేవాలయ అధికారులకు మున్సిపల్ అధికారులకు సమన్వయ లోపం ఉండడంతో వేలాదిగా తరలివస్తున్న రాజన్న భక్తులకు తప్పని తిప్పలు. దేవాలయ ప్రాంగణంలో దేవాలయానికి సంబంధించిన దుకాణములు లీజుకు ఇవ్వడంతో దుకాణదారులు రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్వహించడం, అదేవిధంగా పాన్ లీజుకు ఇచ్చిన స్థలంలో రోడ్డు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు. అటు దేవాలయ సిబ్బంది, ఇటు మున్సిపల్ సిబ్బంది కి సమన్వయం లేకపోవడంతో రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. ఈ విషయమై రాజరాజేశ్వర స్వామి దేవాలయ కార్య నిర్వహణ అధికారిని వివరణ కోరగా మా ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులతో కలిసి పరిశీలించామని త్వరలోనే దీనికి ఒక పరిష్కారం చూస్తామని ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ ముత్తారం :** పూర్వ విద్యార్థుల సమ్మేళనం14 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులుప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని పూర్వ ఉపాధ్యాయులు ఆంజనేయులు, ముఖ్య అతిథులుగా పాల్గొన్న కిషన్ రెడ్డి అన్నారు. 14 సంవత్సరాల కిందట పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు ప్రభుత్వ పాఠశాలలో 200809 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కార్యక్రమం ఒడేడు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఆంజనేయులు, రామ్ రెడ్డి, శాంతి శ్రీ, మాధవి, లక్ష్మి , తోపాటుపాల్గొన్నారు.

## న్యాయ విద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ గా



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ ;** ఎఐఎస్ఎఫ్ తెలంగాణరాష్ట్ర న్యాయవిద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ గా ప్రస్తుతం ఎల్ఎల్బి సంవత్సరం చదువుతున్న బాలసాని లెనిన్ ని ఎఐఎస్ఎఫ్ తెలంగాణా రాష్ట్ర కౌన్సిల్ నియమిస్తూతీర్మానం చేసింది .ఈ నియామకం పైన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుకసిరెడ్డి మణికంఠ రెడ్డి పుట్ట లక్ష్మణ్ లు మాట్లాడుతూ తెలంగాణా లో న్యాయ విద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా వింగ్ ఏర్పాటు చేశామని ఈ వింగ్ రాష్ట్రము లోని ఎల్ఎల్బి విద్యార్థుల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు కాగా తన నియమకానికి సహకరించిన రాష్ట్ర జాతీయ నాయకత్వానికి లెనిన్ ధన్య వాదములుతెలిపారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



**ప్రజాపక్షం/చందుర్తి ;** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన లింగంపేట గ్రామంలోని గురునాథం చెరువు అలుగు పోసిన వరద ఉధృతిని పరిశీలించారు. సనుగులలో వరద ఉధృతికి కోతకు గురైన రోడ్డును పొలాలను పరిశీలించి, కోతకు గురైన రోడ్డు మరమ్మత్తులు చేపట్టవలిసిందిగా అధికారులను ఆదేశించారు.

అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, కరెంట్ స్థంభాలను, వైర్లను, విద్యుత్ పరికరాలను తాకరాదని సూచించారు. చెరువులు, కుంట వద్దకు ప్రజలు వెళ్లవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పురాతన ఇళ్లలో ఉన్నవారు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** భారీగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా సుల్తానాబాద్ పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని పలు వార్డులను సందర్శించి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్ల వద్దనే సంకల్పంతో ముందస్తుగా శిథిలావస్థకు చేరిన ఇండ్లను ప్రభుత్వ ఆదేశానుసారం మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని పదవ వార్డ్, గాంధీ నగర్,మూడోవార్డు, గడి మహల్ లో వడ్లూరి లక్ష్మి, వడ్లూరి గంగయ్య, జంజరాల నరసమ్మ , కొలిపాక లక్ష్మీ రాజం లకు సంబంధించిన ఇండ్లు పూర్తిగా శిధిలా వ్యవస్థలో ఉన్నందున వారికి సురక్షిత ప్రాంతాల్లో నివసించాలని సూచించారు. విపరీతంగా కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇంట్లో నివసిస్తే ఎప్పుడు ప్రమాదం సంభవించేది తెలియదని తద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతాయని వారిని సురక్షిత ప్రాంతాలలో నివసించే విధంగా సూచించారు. అలాగే కాలనీలలో పేరుకుపోయిన నీటి నిల్వలను తొలగించేందుకు ప్రత్యేక కచ్చా డ్రైను ఏర్పాటు చేసి నీరును దారి మళ్లించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అనుమాల అరుణ బాబురావు, నిషాద్ రఫీక్, మున్సిపల్ మేనేజర్ అలీ మొద్దీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, రాజ కుమార్, ఆనంద్,వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

# ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్,శాంతినగర్ చౌరస్తా,శాస్త్రినాగర్,పలు ప్రాంతాల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,నిర్మల్ డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు,నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్,కమిషనర్ సవీఎన్ రాజు సోమవారం పర్యటించారు.భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారుల పై నిలిచిపోయిన వర్షపు నీటిని,మురుగు నీటి నాళాలను పరిశీలించారు.ప్రజలకు,వాహనదారులకు రోడ్లు పై నిలిచిన వర్షపు నీటి తో ఏలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా మున్సిపల్ సానిటరీ సిబ్బంది సహాయం రోడ్డు పై నిలిచిపోయిన వర్షపు నీటిని మురుగు నీటి నాళాలోకి మళ్లిస్తున్నారు.మురుగు నీటి నాళాల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నటువంటి చెత్తాచెదారం మొక్కలు వంటిని తొలగింపచేస్తున్నారు.కౌన్సిలర్లు,సానిటరీఎస్.ఐ విదాస్,పలువురు ఉన్నారు.

# జిఎన్ఆర్ కాలనీ పరిశీలన...



**ప్రజాపక్షం/నిర్మల్/సోన్ ;**బాధితులు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని ప్రభుత్వం తరుపున అన్ని విధాల ఆదుకుంటామని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు.జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే లోతట్టు ప్రాంతమైన సోను మండలంలోని జప్రాపూర్ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న వరదనిరుతో పాటు జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు.అలాగే నిర్మల పట్టణంలోని జిఎన్ఆర్ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను పరిశీలించి,ప్రజలను సురక్షిత ప్రాంతాలలోకి తరలించాలని సూచించారు.అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.వారి వెంట బిజెపి నాయకులు ముత్యం రెడ్డి,మార గంగారెడ్డి,హరీశ్ రెడ్డి,మేకల అశోక్,నవీన్ పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం /ముత్తారం :** మండలంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ అన్న ప్రసన్న సూచించారు. ముత్తారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కిరణ్, జిల్లా ఎంహెచ్ఎన్ డాక్టర్ వాణిశ్రీతో కలిసి సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా ముందుగా ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పరిస్థితి పై మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావుతో కలిసి చర్చించి, తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యాక్సిన్ రూమ్ తనిఖీ చేసి, ఫార్మాసిస్ట్ రికార్డ్సు, వ్యాక్సిన్ రికార్డ్సు తనిఖీ చేశారు. అనంతరం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు, వైద్య సిబ్బందితో సమీక్షించారు.కేశనపల్లిలో వైద్య శిబిరంముత్తారం మండలంలోని కేషనపల్లిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు తన వైద్య సిబ్బందితో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 86 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో 18 మంది జ్వరపీడితులను గుర్తించారు. కొంత మంది నుంచి రక్తనమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

# జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/గంగాధర:**ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సంధర్భంగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో పవన్ కళ్యాణ్ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ అభిమాని కోల అనిల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ బలపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాన్ అభిమానులు గొంటి సంజీవ్ కుమార్, నరుకుల్ల గంగన్న, గడ్డమీది పరశురాం గౌడ్, భానుచందర్ గౌడ్, రాకేష్ గౌడ్, అరవింద్, జేమ్స్, దేశెట్టి శ్రీనివాస్, రావుల సతీష్ తదితరులున్నారు.

# ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం



**ప్రజాపక్షం/గంగాధర;**గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో ఫాతిమానగర్ అడోరేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు , బాలికలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ ప్రీతా సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు , బాలికలకు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జీవనోపాధి కల్పించే కోర్సులు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇప్పించి వారిని ప్రయోజకులను చేయడానికి సంస్థ పని చేస్తుందని తెలిపారు. స్వచ్ఛంద సేవలను పెంపొందిస్తూ మతాలకతీతంగా సాంఘిక సాంస్కృతిక బాషాపరమైన కులవర్గాల జీవన స్థితిగతులపై చైతన్య పరుచుట జరుగుతుందన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, వెలంగిని, సంస్థ ప్రతినిధులు మంత్రి మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, మౌనిక, గ్రామ తాజా మాజీ సర్పంచ్ జోగు సాగర్, ఉప సర్పంచ్ బచ్చు రాజేశ్వరి, గ్రామ విఏఏలు పెండ్యాల సువర్ణ, బచ్చు భాగ్య పాల్గొన్నారు.

# ప్రవేశాల గడువు పొడగింపు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ ;** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటిలో 202425 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సులలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడగించినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బిఎ,బికాం,బిఎస్‌సి కోర్సులలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. గత నెల ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉండగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటి అధికారులు ఈనెల 30 వరకు గడువు పొడగించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు గడువు తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసిన తర్వాత కోర్సు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి 2 సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లు, 1 పాస్ ఫోటో, ఆన్‌లైన్ హార్డ్ కాపిప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాగజ్‌నగర్‌లో సమర్పించి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి;**వరద బాధితులను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వరదలతో రాష్ట్ర ప్రజు అష్టకష్టాలు పడుతుంటే రేవంత్ సర్కార్ మొద్దు నిద్రపోతున్నదని దుయ్యబట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికి వెళ్లాలన్నా హెలికాప్టర్ దొరుకుతుందని, కానీ వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు హెలికాప్టర్ దొరకదా? అని ప్రశ్నించారు.గతంలో వరదలు వస్తే కెసిఆర్ స్వయంగా పరామర్శించి ధైర్యాన్నిచ్చారని గుర్తు చేశారు. తక్షణ సాయం కింద ములుగు జిల్లాకు రూ.2.25 కోట్లు, భూపాలపల్లికి రూ.2 కోట్లు, మహబూబాబాద్‌కు రూ.1.50 కోట్లు విడుదల చేశారని తెలిపారు. గతంలో పిసిసి అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందిస్తామని చెప్పారని, ఇప్పుడు అధికారంలో ఉండి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# హెల్ప్ డెస్క్ ప్రారంభించిన సుడా చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్;**ప్రజల కష్టాన్ని తన కష్టంగా బావించి వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన స్పూర్తిగా వర్ధంతి రోజున నగర కాంగ్రెస్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించినట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రిబ్బన్ కట్ చేసి హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించి మాట్లాడారు. సిఎంఆర్ఎఫ్‌తో పాటు ఆరు గ్యారంటీలకు సంబంధించిన అవగాహన, వివిధ సమస్యల పరిష్కారానికై హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# అధికారికి సన్మానం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ ;** శ్రీరాంపూర్ ప్రాంతంలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఐటి విభాగంలో జనరల్ మజ్దూరుగా పనిచేసి పదవి విరమణ పొందిన రాజేశ్వరి సమావేశ మందిరంలో ఎస్ఓటు జిఎం ఎన్. సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 35 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందిన ఆమెను కొనియాడారు. అనంతరం ఆమె శేష జీవితం ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డిజిఎం పర్సనల్ పి.అరవిందరావు, పిఎం రాజేశ్వర్, పర్సనల్ అధికారి చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, కాంతారావు, ప్రబంధిత, పద్మ, శ్రీనివాస్, రామచందర్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/బోధన్;**బోధన్ డివిజన్ పరిధి లోని బోధన్, కోటగిరి, రెంజల్, ఎడపల్లి, రుద్రూర్ మండలాల్లో ఖాళీగా ఉన్న 18రేషన్ దుకాణాలను నడిపేందుకు డీలర్ల కోసం దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో అంబ దాస్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ పద్దతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొ న్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తు లను సెప్టెంబర్ 13వరకు బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. దరఖాస్తుకు జతపరిచే ధ్రువపత్రాలపై గెజి టెడ్ అధికారి సంతకం చేయించాలని పేర్కొ న్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాత పరీక్ష ఈ నెల 26న ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆర్డీవో కార్యాల యంలో సంప్రదించాలని సూచించారు.

## వర్షానికి కూలిన ఇల్లు



**ప్రజాపక్షం/ఎడపల్లి;**అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నవీపేట్ మండల కేంద్రంలో ఒక నివాస గృహం కూలిపోయింది. నవీపేట్ మండల కేంద్రానికి చెందిన బుర్ర నాగన్నకు చెందిన ఇల్లు వర్షాలకు తడిసి కూలిపో యింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణ పాయం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

## మరమత్తుల కోసం ప్రతిపాదనలను పంపిస్తాం

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రం లోని ఆదర్శ పాఠశాల రహదారి, పెద్ద చెరువు, మల్లాపూర్ నుండి మొగిలిపేట వెళ్లే రహదారి మరమ్మత్తులు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని పంచాయతీ రాజ్ డిఈ రమణారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమ వారం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డితో కలిసి ఆదర్శ పాఠశాల రోడ్డు, పెద్ద చెరువు, మొగిలిపేట రోడ్డును పరిశీలిం చారు. వీరి వెంట నాయకులు గడ్డం శ్రీని వాస్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, గోల్కొండ రమేష్, నూతిపెల్లి రాజం ఉన్నారు.

## వంతెనను పరిశీలించిన ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో అధిక వర్షాలతో వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోవడంతో సోమవారం రోజున ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నాయకులతో కలిసి పరి శీలించారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జున్ను రాజేందర్,మాజీ ఎంపిపి మహేష్, మాజీ సర్పంచ్ రాధాకి షన్, మాజీ సర్పంచ్ జలంధర్, కాంగ్రెస్ నాయకులు రాజు, మస్తాన్ ఉన్నారు.

# సంక్షేమ హాస్టళ్లకు అద్దె భవనాలు దిక్కా?

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి;**సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, అరకొర వసతులతో అద్దె భవనాలతో నెట్టు కొస్తున్న బిసి సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించా లని బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్ ఆద్వర్యంలో బిసి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణఃగా విధ్యార్థులు సొంత భవనాలు లేక అద్దె హాస్టల్లో ఇబ్బందులకు గురైన సంధర్భాలు చాలా ఉన్నాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి పక్కా భవనాలు నిర్మించా లని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఎమ్మెల్యేలకు, మంత్రులకు, కలెక్టరేట్ల కార్యా లయాలు కట్టారు తప్ప సంక్షేమ హాస్టళ్లను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విధ్యార్థుల ఇబ్బందులను దృష్టిలో



పెట్టుకుని ముఖ్యమంత్రి సంక్షేమ హాస్టళ్లకు నూతన భవ నాలు నిర్మిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో బిసి సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యాం, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీని వాస్, నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, బిసి సంఘం జిల్లా నాయకులు ఎడ్ల ఉమామహేశ్వర , బిసి సంఘం నాయకులు తదితరులున్నారు

# గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం / మల్లాపూర్ ;** భారీ వర్షాలు కురుస్తున్న నేఫథ్యంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ఎగువన ఉన్న మహా రాష్ట్ర నుండి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గేట్లు ఎత్తి వరద నీరును గోదావరి నదిలోకి వదులుతున్నారని నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు సూచించారు. ఈ మేరకు సోమవారం వాల్గొండ



గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి నది ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలించారు. గత మూడు రోజులు నుండి కురుస్తున్న వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుందని ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి వరద నీటిని వదల డంతో గోదావరి ఉధృతిపెరిగే అవకాశం ఉందని నదిలోకి గొర్రెలు, బర్రెల కాపరులు ప్రజలు ఎవరూ కూడా వెళ్ల కుండా చూడాలని అధికారులు అప్రమత్తంగా ఉండి ఉధృ తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. భారీగా వరదలు వస్తే ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్త లపై ఆరా తీశారు. వీరి వెంట డిఆర్‌డివో రఘువరన్, నక్క శ్రీనివాస్, డిఎస్పీ ఉమా మహేశ్వర్ రావు, తహశీల్దార్ వీర్ సింగ్, సిఐ నిరంజన్ రెడ్డి, ఎంపిడివో జగదీష్, ఎస్సై కిరణ్, ఎస్సారెస్పీ ఏఈ రాకేష్,రాజేష్, రెవెన్యూ,పోలీస్ సిబ్బంది గ్రామస్థులు ఉన్నారు.

# మండలంలో75ఎంఎం వర్షపాతం నమోదు

**ప్రజాపక్షం/ఎడపల్లి;**అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడపల్లి మండలంలో సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉండ టంతో చెరువులన్నీ నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. మండలంలో 75ఎంఎ వర్షపాతం నమోదైనట్లు తహసీ ల్దార్ ధన్వాల్ పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కూలే దశలో ఉన్న ఇండ్లలో నుంచి ప్రజలు వేరే స్థలాలకు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా కుర్నాపల్లి గ్రామంలో రెండు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని వారిని స్థానిక రెవెన్యూ సిబ్బంది సురక్షిత స్థలాలకు తరలిం చడం జరిగిందని ఆయన తెలిపారు. వర్షాల వల్ల ఏవైనా



ఇబ్బందులు ఉంటే తమ రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తెలియచేయాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని నీటి ప్రవాహాలు ఉన్నచోట అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# విద్యుత్ సరఫరాపై నిత్యం పర్యవేక్షణ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి;**బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో టిజి ఎన్పిడి సిఎల్ కరీంనగర్ సర్కిల్‌కు నియమించిన నోడల్ ఆఫీసర్ రాజు చౌహాన్ విద్యుత్ సరఫరాపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయిలో సంబంధిత సిబ్బంది, అధికారులతో సమ న్వయం చేసుకుంటూ విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగ వంతం చేస్తున్నారని సూపరింటెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. చెట్లు విరిగి స్థంబాలపై పడడంతో 31 పోల్‌లు, 03 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయ న్నారు. వరదల వల్ల నీట మునిగిన సబ్ స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మత్తులు పూర్తయ్యే వరకు ప్రత్యా మ్నాయ విద్యుత్తును సరఫరా అందిస్తున్నామని పేర్కొ న్నారు. 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది అధికారులందరూ అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే తమ సిబ్బంది పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉన్నారని, కుండ పోతగా కురుస్తున్న వర్షంలో అర్ధరాత్రి అని సైతం లెక్కచే యకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే తమ సిబ్బంది విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరించడంపై అభి నందించారు. వినియోగదారులు విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాలని, విద్యుత్ స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డు లను తడి చేతులతో ముట్టుకోరదన్నారు. స్వీయ నియం త్రణ ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మత్తులు చేపట్టరాదని కోరారు. విద్యుత్ అంత రాయం, మరే ఇతర సమస్యలు ఉన్న యెడల వినియోగదా రులు 94400811444, టోల్ ఫ్రీ నెంబర్ 1912, 18004250028 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ చంద్రమౌళి, ఏడీలు అంజయ్య, ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన మండల ప్రత్యేకాధికారి

**ప్రజాపక్షం/గొల్లపల్లి ;** భారీవర్షాలు కురుస్తున్న కారణంగా జగి త్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలో సోమవారం మండల ప్రత్యేకాధికారి సాయిబాబా ఎంజెపి గురుకుల పాఠశాల,మోడల్ స్కూల్ హస్టల్‌ను సందర్శించిన స్టోర్ రూమ్‌లలో ఉన్న సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు ప్రతి రోజు సరఫరా చేయుచున్న మద్యాహ్న బోజనాన్ని పరిశీలించి వారితో పాటు స్థానిక అధికారులు విద్యార్థినిలతో కలిసి బోజనం చేశారు. విద్యార్థినిలకు మంచి ఆహారం అందించాలని అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సిబ్బందిని ఆదేశించారు. హస్టల్ పరిసరాల్లో నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ గ్రామ పంచాయతీ సిబ్బందితో వేయిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సామ రాంరెడ్డి, ఎంపివో సురేష్ రెడ్డి, గ్రామ కార్యదర్శి మధుసూధన్, హస్టల్ ప్రిన్సిపాల్ ఉపా ధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రామేశ్వరాలయంలో చివరి సోమవారం పూజలు

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం రామేశ్వర ఆలయంలో శ్రావణమాసం ముగింపు చివరి సోమవారం సందర్భంగా భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో మండలకేంద్రం నుండే కాకుండా చుట్టుపక్కల మండ లాలు, గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని పరమేశ్వరున్ని దర్శించుకుని అభిషేకాలు జరిపారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలోదర్శించుకున్నభఖ్తులకుఅన్నదానకార్య క్రమాన్నిఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

**ప్రజాపక్షం/పిట్లం:** మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమణి వారధి స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు పేర్కొన్నారు. బాన్సువాడకు చెందిన వారధి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం పిట్లం మండలంలోని అటవీ ప్రాంతంలో, ఖాళీ స్థలంలో రోడ్డుకు ఇరువైపులా విత్తన బంతులను జల్లడం జరిగింది. వారు మాట్లా డుతూ ఇలా విత్తన బంతులు చల్లడం ద్వారా వర్షాకాలంలో ఈ విత్తన బంతులు మొలకెత్తి రాబోయే రోజుల్లో వృక్షలుగా మారి సమాజానికి, భవిష్యత్తు తరాలకు చల్లటి నీడను, గాలిని, ఆక్సీజ న్‌ను అందించడంలో తోడ్పడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు ఠాకూర్, గోపాల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి వై.గోపాల్, సుధాకర్, సాయిలు, కోటయ్య, కిషన్, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, పి.కృష్ణ, మహేంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జీవన్ జ్యోతి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకం(పీఎం జేజేబీవై) ద్వారా ప్రతి ఒక్కరికి జీవిత బీమా లభిస్తుం దని ఎడపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ సునీల్ తెలిపారు. పీఎం జేజే బీవై పథకం కింద రూ.350వార్షిక ప్రీమియం చెల్లించిన ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన బ్యాంక్ ఖాతాదారులు గుంజరి సాయిలు ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో సోమవారం పీఎం జేజేబీవై ఇన్యూరెన్స్ రూ. రెండు లక్షల మొత్తం చెక్కును మృతుని భార్య గుంజరి గోదావరికి బ్యాంక్ మేనేజర్ సునీల్ అంద చేసి, మాట్లాడారు. ఇది సామాన్యులకు అందుబాటులో ఉండే పథ కమని బ్యాంకుల ద్వారా ప్రతి ఏటా రెన్యువల్ చేసుకొని 18నుంచి 50ఏళ్ల వయస్సు కలిగి, బ్యాంకులో ఖాతా ఉన్నవారు ఈ పథకానికి అర్హులని ఎడపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ సునీల్ పేర్కొన్నారు.